క్లుప్తంగా

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహోపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని పిడివి కండ్రిగ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై ఇతర మండలాలకు వెళ్లిన లక్ష్మీపతి, వేణులను మంగళవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బంగారుపాళెం మొయిన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు రవి, నవీన్ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఏపీటీఎఫ్ అభ్యున్నతికి చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వాసు, శంకర్, సాగర్, చిరంజీవి, మురళి, శీను పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల చెంతకే వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని నాంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సేవలు



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

తవణంపల్లె: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముంగిటకే సేవలు అందిస్తోందని సచివాలయ మండల కన్వీనర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని సరకల్లు, పుణ్యసముద్రం గ్రామాల్లో జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించారు. సరకల్లులో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు జగనన్న సురక్ష పథకం వరం అన్నారు. పుణ్యసముద్రంలో సర్పంచ్ ఎంకే జయసుధ, ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం, డీటీ వెంకటరమణ చేతుల మీదుగా 365 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అదే విధంగా సరకల్లులో తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ కుమార్, సర్పంచ్ సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బుజ్జి, సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి చేతుల మీదుగా 273 మందికి సర్టిఫికెట్లను అందజేశారు.

65 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిత్తపార గ్రామంలో మంగళవారం 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు డాక్టర్ సందీప్ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వర్షాకాల నేపథ్యంలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని.. ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సంధ్య, చంద్ర, హేమలత, ఇందుమతి, మంజుల, కోకిల, విజయ పాల్గొన్నారు.

రెవరెండ్ విక్టర్ మృతి



చక్రం జాన్ విక్టర్ (ఫైల్)

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం గంగనపల్లెకు చెందిన రెవరెండ్ చక్రం జాన్ విక్టర్ మంగళవారం అనారోగ్యంతో వేలూరు ఆస్పత్రిలో మృతి చెందారు. చిత్తూరు సీఎస్‌ఐ క్రైస్తవ శ్మశాన వాటికలో బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు. కాగా ఈయన ఉమ్మడి జిల్లాలోని రేణిగుంట, పీలేరు, పచ్చికాపల్లం, నెల్లూరు జిల్లాలోని వాకాడు, చైన్నైలో ఎస్‌ఏఎల్‌సీ చర్చిల్లో పాస్టర్‌గా పనిచేశారు.

20న గేటు వసూలుకు వేలం

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలో టీఎస్ అగ్రహారంలోని సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆగస్టు 3 నుంచి 10వ తేదీ వరకు ఆలయం వద్ద అంగళ్లకు గేటు, తలనీలాల సేకరణకు ఈనెల 20న ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎండోమెంట్ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు తొలుత రూ.1000 చెల్లించాలన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- 44వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం
- స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం నగరంలోని 44వ డివిజన్ తేనబండరోడ్డు, ఏటివారకాలనీ, వీరభద్రకాలనీ, ప్రశాంత్ నగర్ ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు ప్రజాసమస్యలను తెలుసుకున్నారు.

సమస్యలపై వినతి

- ఏటివారకాలనీలో డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేయాలని, అర్హులకు పింఛన్లు ఇప్పించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు.
- తన కొడుకు, కోడలు ప్రమాదంతో మరణించారని, వారికున్న ఇద్దరు ఆడపిల్లలు ప్రస్తుతం చదువుకుంటున్నారని.. చదువు పూర్తయ్యాక ఉద్యోగం ఇప్పించాలని స్థానికురాలు కాంచన విన్నవించారు.
- వీరభద్రకాలనీలో కాలువలు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళ్లలో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని, పోలీసుల గస్తీ పెంచాలని కాలనీవాసులు కోరారు. అదే విధంగా రోడ్డుపై అంబులెన్స్‌లు పార్కు చేస్తుండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని.. వాటిని అక్కడ పెట్టకుండా చూడాలన్నారు.
- వీధి దీపాలు, నీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

డివిజన్ వాసులకు రూ.11 కోట్లు లబ్ధి

అనంతరం సచివాలయ ఉద్యోగులు, సంబంధితశాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 44వ డివిజన్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ.11 కోట్లు ఖర్చు చేశారని ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానికులు తీసుకొచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అరుణ, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి అల్తాఫ్, సచివాలయ కన్వీనర్ కోలాకిరణ్, నాయకులు మోహన్, వినాయక బాలాజీ, రఘురామ్, షరీఫ్, చిట్టి, హరి, ప్రేమ్, సీతాపతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు 45వ డివిజన్‌లో..

నగరంలోని 45వ డివిజన్ ఇందిరానగర్‌లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు స్థానిక నాగాలమ్మగుడి వద్ద కార్యక్రమం ప్రారంభం కానుంది.

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం



గుర్రంకొండవాండ్లవూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాబు

బంగారుపాళెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం బంగారుపాళెం-2 గ్రామ సచివాలయం పరిధిలోని గుర్రంకొండవాండ్లవూరు, గోవర్ధనగిరి, ఊటువంక, కాటంవాండ్ల ఊరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. బంగారుపాళెం మేజరు పంచాయతీ పరిధిలో నిత్యవసర సరకులు సరఫరాచేసే వాహనం గ్రామాల్లోకి రావడంలేదన్నారు. ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించేందుకు వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధికి పాటు పడుతున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మరోసారి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎల్లప్ప, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, స్థానిక సర్పంచ్ ఉమాదేవి, ఎంపీటీసీ ఉషా, ఉపసర్పంచ్ కామరాజు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, పార్టీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, పరదేశి, దొరస్వామి, కిషోర్‌కుమార్‌రెడ్డి, మహేంద్ర, లక్ష్మీప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

దోమల నివారణతో ఆరోగ్యం



ఆరిమాకులపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

యాదమరి: దోమల నివారణతో జ్వరాల వ్యాప్తిని అరికట్టవచ్చని సంతగేటు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆరిమాకులపల్లె గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. దోమకాటు కారణంగా జ్వరాలు వస్తాయన్నారు. వాటిని అరికట్టేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభ శైలిలో బోధించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2

ఐరాల: ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సులభశైలిలో బోధన చేయాలని అదనపు ఎంఈఓ దామోదర్‌నాయుడు సూచించారు. మంగళవారం మండలంలోని జంగాలపల్లె ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. రికార్డులు, విద్యార్థుల వర్కుబుక్స్ పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంగ్లిష్, గణితం వంటి సబ్జెక్టుల్లో విద్యార్థులు ఆందోళన చెందకుండా నైపుణ్యాలతో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంట నిర్వహకులు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించేలా పర్యవేక్షించాలని హెచ్‌ఎంకు సూచించారు.

సేవలు సులభతరం



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్: జగనన్న సురక్షలో సేవలు, ధ్రువ పత్రాలు సులభంగా పొందవచ్చని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. చిత్తూరు మండలం తాళంబేడు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసేవలను సులభతరం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కుల ధ్రువీకరణ పత్రం 120 మందికి అందజేశారు. ఆదాయం 128 మందికి, ఫ్యామిలీ సర్టిఫికెట్ 5, జనన, మరణ 5, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం 40, రైస్‌కార్డు 20 మందికి అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, డీటీ ధనంజయ్య పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

గుడిపాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతున్నాయని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిత్తపార, రామభద్రాపురం పంచాయతీల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సుమారు 600 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. వివిధ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ సత్వరమే ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ మధుసుదన్‌రెడ్డి, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ చంద్ర, వైస్ ఎంపీపీ గోపి, సచివాలయ కన్వీనర్ సాయి, సర్పంచ్‌లు రవి, రమ్య, నాయకులు శ్రీధర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, సూరి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. గ్రామోత్సవం



తిరుచ్చి వాహనంపై నుంచి కటాక్షిస్తున్న ఆండాళ్ అమ్మవారు

నారాయణవనం: ఆండాళ్ అమ్మవారు మంగళవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో విహరించారు. స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాలు ఈనెల 13న గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తమిళ ఆడి నెలలో పది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. మంగళవారం ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. స్వామి అష్టదల పాదపద్మారాధన సేవను నిర్వహించారు. అనంతరం ఆండాళ్ అమ్మవారికి అభిషేకాలను, అర్చనలను చేపట్టారు. సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన ఆండాళ్ అమ్మవారు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు హారతులు ఇచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఆండాళ్ అమ్మవారికి అర్చకులు ఆస్థానం నిర్వహించారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కార్మికులు

పుత్తూరు రూరల్: పుత్తూరు చిదా స్పిన్నింగ్ మిల్లు వ్యవహారం ‘గోటితో పోయేదాన్ని గొడ్డలి దాక తెచ్చుకోవడం’ అనే సామెతను గుర్తుకు తెస్తోంది. మిల్లును అర్ధాంతరంగా మూసివేసిన యాజమాన్యం కార్మికులకు న్యాయపరంగా చెల్లించాల్సిన నష్టపరిహారం చెల్లించడంలో మొండి వైఖరిని అవలంభించింది. దీనిపై సీఐటీయూ అధ్యక్షుడు ఏ.బాబు మరో 15 మంది కార్మికులు ఈనెల 17 సోమవారం రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారు. అదే రోజు నంబర్ కావడంతో ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్ అండ్ ఫ్యాక్టరీస్, అమరావతి వారిని, కమిషనర్ ఆఫ్ లేబర్, విజయవాడ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, తిరుపతి, చిదా స్పిన్నింగ్ మిల్ ప్రైవేట్ లిమిటెడ్, పుత్తూరు వారిని ప్రతివాదులుగా చేసి నోటీసులు జారీ అయ్యాయి. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు మిల్లును విక్రయించడం గానీ, అందులోని యంత్రాలను తరలించడం గానీ చేయరాదంటూ ఆదేశాలు జారీ చేసింది.

21న విద్యుత్ అదాలత్

బంగారుపాళెం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 21వ తేదీ శుక్రవారం విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏఈ రామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు రూరల్ డివిజన్ ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ జరుగుతుందని పేర్కొన్నారు. బంగారుపాళెం, యాదమరి మండలాలకు చెందిన వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

యాదమరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పెరియంబాడి నాగరాజు తెలిపారు. చెన్నై ఎంఎస్ కంటి ఆస్పత్రి వైద్యులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కంటి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పామును తప్పించబోయి..

కేవీబీపురం: అకస్మాత్తుగా పాము రోడ్డుకు అడ్డంగా రావడంతో ఆగి ఉన్న 108 వాహనాన్ని ఢీకొట్టి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని రాగిగుంట జెడ్పీ పాఠశాల వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం.. పిచ్చాటూరు మండలానికి చెందిన రాకేష్ శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం కళాశాలలో జరిగిన సెమిస్టర్ పరీక్షకు హాజరై మరో ఇద్దరు యువకులతో కలిసి ద్విచక్ర వాహనంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. రాగిగుంట కూడలి సమీపంలో పాము రోడ్డుపైకి అకస్మాత్తుగా రావడంత దానిని తప్పించే క్రమంలో ఆగి ఉన్న 108 వాహనాన్ని యువకులు ఢీకొట్టారు. ఈ ఘటనలో రాకేష్(18) అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

రుయా దొంగ దొరికాడు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలోని వయోవృద్ధుల చికిత్స వార్డులో ఇటీవల ఓ వృద్ధురాలు నుంచి కమ్మలు కాజేసిన వ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సెక్యూరిటీ సిబ్బంది కథనం.. రుయా ప్రాంగణంలో అనుమానంగా తిరుగుతున్న మహేష్ అనే వ్యక్తిని పట్టుకుని గతంలో కమ్మలు కాజేసిన సందర్భంలో సేకరించిన ఫొటోలను పరిశీలించారు. ఫొటో మ్యాచ్ అవడంతో సిబ్బంది మంగళవారం వెస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే వ్యక్తి గతంలో మెటర్నటీ ఆస్పత్రిలో సెక్యూరిటీగా పనిచేస్తూ.. రోగుల నుంచి మొబైల్ దొంగతనం చేస్తూ పట్టుబడ్డాడు. దీంతో అతన్ని విధుల నుంచి తొలగించారు. పట్టుబడ్డ మహేష్‌ను విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు



కార్వేటినగరం: స్కంధపుష్కరిణి సమీపంలో కుమారగిరిపై వెలసిన వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేశారు. అలాగే సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన వీరాస్వామియాదవ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక అభిషేక, పూజలు చేపట్టారు. అనంతరం వళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పలువురు పాల్గొన్నారు.

పైసా ఖర్చులేకుండా ప్రభుత్వ సేవలు



మహాసముద్రం సచివాలయంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బాబు

బంగారుపాళెం: ప్రజలకు నయా పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని మహాసముద్రం గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ పాలనలో పింఛన్, రేషన్ కార్డు ఇలా ఏది కావాలన్నా జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేగాని సంతకం పెట్టేవారు కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎవరి సంతకాలతో అవసరం లేకుండా అర్హులై ఉంటే చాలు ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం ప్రజలకు చేరువయ్యాయన్నారు. మిగిలిన ఒక్క శాతంలో ఎవరైనా అర్హులు ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మేలు చేకూరుస్తామన్నారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి ప్రజలకు అవసరమైన సేవలకు దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని జగనన్న సురక్ష శిబిరాల్లో పరిష్కరిస్తున్నారని తెలిపారు. కుల, ఆదాయం, కుటుంబసభ్యుల, జనన, మరణ ధ్రువీకరణపత్రాలు, ఆధార్, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు వంటి 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ షర్మిలారెడ్డి, మండల ప్రత్యేక అధికారి విజయభాస్కర్ పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్ కుటుంబానికి పరామర్శ

పూతలపట్టు: మండలంలోని పోటుకనుమ సచివాలయ కన్వీనర్ టి. కోదండరామ్ ఆదివారం గుండె పోటుతో మృతిచెందారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జీవరత్నం రెడ్డి, ద్వారకనాథరెడ్డి ఉన్నారు.

విప్లవాత్మక మార్పు

పూతలపట్టు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం గ్రామాల్లో విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని తేనేపల్లి, వడ్డేపల్లి పంచాయతీల్లో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినతులను పరిష్కరించడం, అర్హులకు సంక్షేమ పథకాలు అందడం కోసమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. తేనేపల్లి పంచాయతీలో 355 మందికి, వడ్డేపల్లిలో 350 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, సర్పంచ్‌లు రాధ, జయచంద్రారెడ్డి, పార్టీ నాయకులు బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, చిట్టెమ్మ, నందయ్య, సుధాకర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, పురోషత్తం నాయుడు, కోదండరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, జాన్‌విక్టర్ పాల్గొన్నారు.


ఆత్మీయ వీడ్కోలు



బోడబండ్లలో ఉపాధ్యాయులకు సన్మానం

బంగారుపాళెం: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని బోడబండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డీవైఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు సుమతి, గంగాభవాని, హేమలత, భాస్కర్‌ను సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు, ఎంఈఓ-2 రమేష్, సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ సభ్యుడు హరి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర తదితరులు పాల్గొన్నారు.

మేకను కబళిస్తుండగా..



మేకను మింగుతున్న కొండచిలువ



కాపరులు చంపిన కొండచిలువ

నారాయణవనం: మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగలో మంగళవారం కొండచిలువ బారి నుంచి ఓ మేకను రక్షించారు. వివరాలు.. దళితవాడకు చెందిన అన్నెమ్మ తన మేకలను సమీపంలోని అటవీ ప్రాంతానికి మేత కోసం తోలుకెళ్లింది. మధ్యాహ్నం మందలో ఒక మేక తగ్గడంతో ఆమెతో కలిసి తోటి కాపరులతో కలిసి అడవిలో గాలింపు చేపట్టారు ఓ కొండచిలువ మేకను మింగేందుకు యత్నిస్తుండడాన్ని గుర్తించారు. కొండచిలువను చంపి మేకను రక్షించారు. కొండచిలువ సుమారు 10 అడుగుల పొడవు ఉందని వారు తెలిపారు.